

ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం



జిల్లా వ్యాప్తంగా అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు పాఠశాలల్లో విద్యార్థులు యోగాసనాలు వేశారు. ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు ర్యాలీ నిర్వహించి యోగా వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. అలాగే పలు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడారు. యోగా అనేది పూర్వీకులు మనకు ఇచ్చిన గొప్ప వరమన్నారు. శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండేందుకు యోగా దోహదపడుతుందన్నారు.

- న్యూస్ నెట్‌వర్క్, నిజామాబాద్

● మహిళా డిగ్రీ కళాశాలలో ఆసనాలు...



నగరంలో జయశంకర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

ప్రొఫెసర్ జయశంకర్‌కు ఘన నివాళులు

సుభాష్‌నగర్, జూన్ 21: ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతి సందర్భంగా శుక్రవారం జిల్లా వ్యాప్తంగా ఆయన విగ్రహానికి, చిత్రపటానికి ఘన నివాళులర్పించారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని కంఠేశ్వర్ చౌరస్తాలోగల ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో ఆయన కృషి అనిర్వచనీయమని అన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రాంకిషన్‌రావు, ప్రభాకర్‌రెడ్డి, మురళి, నర్సింగ్‌రావు, శంకర్, పాల్గొన్నారు.



మామిడిపల్లి వద్ద ఆర్‌వోబీ పనులను పరిశీలిస్తున్న ఎంపీ అర్వింద్

ఆర్వోబీ పనులను వేగవంతం చేయాలి

● ఎంపీ ధర్మపురి అర్వింద్

డిచ్‌పల్లి, జూన్ 21: జిల్లాలో చేపడుతున్న ఆర్వోబీ వంతెన నిర్మాణ పనులు వేగవంతం చేయాలని అధికారులకు, కాంట్రాక్టర్‌లకు ఎంపీ అర్వింద్ ధర్మపురి సూచించారు. మాధవనగర్ వద్ద కొనసాగుతున్న ఆర్వోబీ పనులను శుక్రవారం ఎంపీ అధికారులతో కలిసి పరిశీలించారు. వంతెన నిర్మాణ పనులపై సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకొని పలు సూచనలు చేశారు. మాధవనగర్ ఆర్వోబీ పనులు 90 శాతం పూర్తయ్యాయని, త్వరలోనే నిర్మాణం పూర్తిచేసుకొని సంక్రాంతి లోపు ప్రారంభం అయ్యేలా పనులు నిర్వహించలన్నారు. రాష్ట్ర మంత్రి వెంకట్‌రెడ్డి రూ.14కోట్ల నిధులు వెంటనే మంజూరు చేయాలని జిల్లాకు చెందిన సీనియర్ శాసన సభ్యులు చర్యలు తీసుకోవాలని అన్నారు. అర్సపల్లి వంతెన నిర్మాణ పనులు కూడా ఆలస్యంగా జరుగుతు న్నాయని కాంట్రాక్టర్‌కు రూ.18కోట్లు ఇవ్వాల్సి ఉందన్నారు. ఆయన వెంట బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ కులచారి, ఆర్‌అండ్‌బీ అధికారులు పాల్గొన్నారు.

రెండు నెలల్లోగా పూర్తి

ఆర్మూర్‌రూరల్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని ఆర్‌వోబీ పనులను రెండు నెలల్లోగా పూర్తి చేయిస్తామని ఎంపీ అర్వింద్ అన్నారు. శుక్రవారం మామిడిపల్లి ఆర్‌వోబీ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పనలును పరిశీలించి నాణ్యతతో కూడిన పనులు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం ఆర్‌వోబీల నిర్మాణానికి నిధులు మంజూరు చేసినప్పటికీ పనులు ఎందుకు పూర్తి కావడంలేదని అధికారులను ఆయన ప్రశ్నించారు.

అలసత్వంపై ఎంపీ ఆగ్రహం

మాక్లూర్: మండలంలోని మామిడిపల్లి వద్ద నిర్మిస్తున్న రైల్వే ఓవర్‌బ్రిడ్జి పనుల అలసత్వంపై అధికారులు, కాంట్రాక్టర్‌పై ఎంపీ అర్వింద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పనుల నత్తనడకపై ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయంలో మంజూరైన నిధులను బాల్కొండ నియోజకవర్గానికి అప్పటి మంత్రి మళ్లించారని తెలిపారు. ఎంపీ వెంట పార్టీ నాయకులు పుప్పాల శివరాజ్‌కుమార్, దినేష్‌కుల చారి, గంగోని సంతోష్, సురేష్‌నాయక్, కంచెట్టి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

ధరణి దరఖాస్తుల పరిష్కారంలో వేగం పెంచండి

● బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

బోధన్‌రూరల్, జూన్ 21: ధరణి దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను వేగవంతం చేసి అర్హులైన ప్రతి రైతుకూ ప్రయోజనం చేకూరేలా చొరవ చూపాలని ఎమ్మెల్యే పి.సుదర్శన్ రెడ్డి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు అధికారులకు దిశానిర్దేశం చేశారు. బోధన్ అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలోని ఆయా మండలాలలో ధరణి పెండింగ్ దరఖాస్తులపై శుక్రవారం బోధన్ పట్టణంలోని ఇరిగేషన్ గెస్ట్ హౌస్‌లో కలెక్టర్‌తో కలిసి ఎమ్మెల్యే సంబంధిత రెవెన్యూ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఒక్కో మండలం వారీగా ఆయా మాడ్యూల్స్‌లో పెండింగ్‌లో ఉన్న దరణి దరఖాస్తులపై చర్చించారు. వాటి పరిష్కారానికి చేపట్టాల్సిన చర్యలపై అధికారులకు కలెక్టర్ సూచనలు చేశారు. తహసీల్దార్లు తమ లాగిన్‌లో ఏ ఒక్క ధరణి దరఖాస్తు సైతం పెండింగ్‌లో ఉండకుండా నాలుగు రోజుల వ్యవధిలోపు అన్నింటిని పరిష్కరించాలని సూచించారు. మ్యూటేషన్, సక్సేషన్, నాలా కన్వర్షన్, ఖాతా మెర్జింగ్, పాస్ పుస్తకాలలో డేటా కరెక్షన్, టీఎం-33 తదితర అంశాలను సంబంధిత దరఖాస్తులను తహసీల్దార్‌లకు స్వయంగా క్షేత్రస్థాయిలోకి వెళ్లి పరిశీలన జరుపాలన్నారు. ఎలాంటి తప్పిదాలకు ఆస్కారం లేకుండా వాస్తవ పరిస్థితులతో కూడిన నివేదికను నిబంధనలకు అనుగుణంగా రూపొందించి ఆర్డీవో లాగిన్‌కు ఫార్వర్డ్ చేయాలని సూచించారు. ధరణి దరఖాస్తుల పరిష్కారానికి సంబంధించిన ప్రగతి గురించి రోజువారిగా నిశిత పరిశీలన జరపాలని బోధన్ ఆర్డీవో రాజేశ్వర్‌ను ఆదేశించారు. ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. బోధన్ నియోజకవర్గ పరిధిలో 10,013 దరఖాస్తులు రాగా ఇప్పటికే 8592 దరఖాస్తులు పరిష్కరించారని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న మిగతా 1421 దరఖాస్తులను సైతం వేగవంతంగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. సమావేశంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, బోధన్ ఆర్డీవో రాజేశ్వర్, ఆయా మండలాల తహసీల్దార్‌లు, రెవెన్యూ ఇన్స్‌స్పెక్టర్లు, సర్వేయర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



హస్తం గూటికి పోచారం

కాంగ్రెస్‌లో చేరిన మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి

- సీఎం రేవంత్‌రెడ్డి ఇంటికి వచ్చి ఆహ్వానించడంతో పార్టీలో చేరిన పోచారం
- రైతుల సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధి కోసమే పార్టీలో చేరినట్లు ప్రకటన
- పోచారం కాంగ్రెస్‌లో చేరడంతో కంగుతున్న బీఆర్ఎస్ పార్టీ నేతలు
- ఉమ్మడి జిల్లాలో పోచారం రాకతో పెరగనున్న కాంగ్రెస్ బలం

నిజామాబాద్, జూన్ 21 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి కాంగ్రెస్ గూటికి చేరారు. సీఎం రేవంత్‌రెడ్డి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి హైదరాబాద్‌లోని ఆయన ఇంటికి వచ్చారు. ఆయనతో చర్చలు జరిపారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న ఆయనను కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. పార్టీ కండువాను ఆయనకు కప్పారు. కుటుంబ సభ్యులతో సీఎం మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి పనులను, రైతుల కోసం తీసుకున్న చర్యలు చూసి పార్టీ మారుతున్నట్లు పోచారం శ్రీనివాస్‌రెడ్డి ప్రకటించారు. రైతుల కోసం ఆలోచించి ఈ నిర్ణయం తీసుకున్నానని తెలిపారు. రాజకీయంగా తాను ఆశించేది ఏమీ లేదని ఆయన తెలిపారు.

పోచారం ఇంటికి సీఎం రేవంత్‌రెడ్డి..

బీఆర్ఎస్‌లో సీనియర్ నేత అయిన మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డిని పార్టీలోకి చేర్చుకునేందుకు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో శుక్రవారం రావడం బీఆర్ఎస్ నేతలకు ఊహించని షాక్ తగిలింది. మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి మాజీ సీఎం కేసీఆర్‌కు అతి సన్నిహితంగా ఉన్నారు. పార్టీ మార్పుపై ఎలాంటి సూచనలు కూడా ఇవ్వలేదు. గత కొన్ని రోజుల క్రితం మాజీ సీఎం కేసీఆర్‌తో కలిసి సమావేశంలో పాల్గొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నేరుగా మాట్లాడటంతో పాటు పార్టీలో చేరాలని కోరడం ఆయన ఇంటికి రావడంతో కాంగ్రెస్‌లో చేరారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న ఆయన గతంలో టీడీపీలో ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేశారు. బీఆర్ఎస్‌లోనూ కీలక పదవుల్లో ఉన్నారు. నియోజకవర్గంలో పట్టుతో పాటు ఉమ్మడి జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో ఆయనకు సంబంధించిన అనుచరులు ఉన్నారు. ఆయనను చేర్చుకుంటే ఉమ్మడి జిల్లాలో పార్టీ మరింత బలోపేతం కావడంతో పాటు ఇతర ఎమ్మెల్యేలు కూడా అదే బాటలో నడిచే అవకాశం ఉండటంతో సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయం తీసుకోవడంతో పాటు ఆయనను ఇంటికి వెళ్లి ఆహ్వానించి పార్టీ కండువాను కప్పారు. ఒకటి రెండు రోజుల క్రితం తనకు దగ్గరగా ఉన్న మండల స్థాయి నేతలతో పోచారం చర్చించిన ఆయన రాకను ముందే ఊహించిన కాంగ్రెస్‌లోని ఒక వర్గం చేరికపై మండలాల వారీగా నిరసనలు వ్యక్తం చేశారు. ఇన్‌చార్జి మంత్రి వరకు కూడా వెళ్లి ఫిర్యాదు చేశారు. రాష్ట్ర స్థాయి నిర్ణయం కావడంతో ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు కూడా వారికి సర్దిచెప్పి ధర్నాలు చేయవద్దని కోరినట్లు తెలుస్తోంది. చివరికి ముఖ్యమంత్రి స్వయంగా ఇంటికి వెళ్లి ఆహ్వానించడం వల్ల సీనియర్ నేత పోచారం శ్రీనివాస్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరారు. ఆయన చేరిక వల్ల ఉమ్మడి జిల్లా పరిధిలో కాంగ్రెస్ పార్టీ మరింత బలపడే అవకాశం ఉంది.

ఉమ్మడి జిల్లాలో బీఆర్ఎస్‌కు షాక్..

పోచారం శ్రీనివాస్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరడంతో ఉమ్మడి జిల్లా బీఆర్ఎస్ శ్రేణులు షాక్‌కు గురయ్యారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో శ్రీనివాస్‌రెడ్డికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వడం, పదవుల్లో అవకాశాలు ఇవ్వడం వల్ల ఆయన ఈ నిర్ణయం తీసుకోవడం పార్టీ క్యాడర్ జీర్ణించుకోలేకపోతోంది. బాన్సువాడ నియోజకవర్గం ఉమ్మడి జిల్లా పరిధిలో ఉండటం ఆయన సపోర్టస్ మాత్రం ఆయన వెనకనే కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమవుతున్నారు. ఉమ్మడి జిల్లాలో బీఆర్ఎస్‌కు ఇద్దరే ఎమ్మెల్యేలు ఉండటం ప్రస్తుతం మాజీ స్పీకర్ కాంగ్రెస్‌లో చేరడం వల్ల మాజీ మంత్రులు ప్రశాంత్‌రెడ్డి ఒక్కరే ఎమ్మెల్యేగా ఉన్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలో సీనియర్ నేతలంతా పార్టీ వీడటం వల్ల బీఆర్ఎస్ కింది స్థాయి నేతలు ఆందోళన చెందుతున్నారు. స్థానిక సంస్థల్లోపూ వారు కూడా నేతలతో కలిసి కాంగ్రెస్, ఇతర పార్టీలో చేరేందుకు సన్నద్ధమవుతున్నారు. పోచారం శ్రీనివాస్‌రెడ్డి పార్టీ మారడం పట్ల బీఆర్ఎస్ నేతలు మాత్రం ఉమ్మడి జిల్లా స్థాయిలో ఎలాంటి ప్రకటనలు ఇప్పటి వరకు చేయలేదు.

అభివృద్ధి పనులకు అంతరాయం లేకుండా..

రాష్ట్ర ప్రభుత్వం మారడం వల్ల అభివృద్ధి పనులకు అంతరాయం కలుగకుండా ఉండేందుకు పోచారం పార్టీ మారినట్లు తెలుస్తోంది. అధికార పార్టీలో ఉంటే పనులు కావడంతో పాటు ప్రొటోకాల్ ఉండటం, అధికారులతో సమీక్ష నిర్వహించి నియోజకవర్గ అభివృద్ధికి చర్యలు చేపట్టే అవకాశం ఉండటంతో ఆయన పార్టీ మారినట్లు సన్నిహితులు తెలిపారు. ఆయన తనయుడు పోచారం భాస్కర్‌రెడ్డి భవిష్యత్తు కోసం కూడా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. డీసీసీబీ చైర్మన్‌గా ఉన్న పోచారం భాస్కర్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పదవిని కోల్పోయారు. ఆయనపై బ్యాంక్ డైరెక్టర్లు అవిశ్వాసం ప్రవేశపెట్టడంతో పదవికి రాజీనామా చేశారు.

కాంగ్రెస్‌కు పెరగనున్న బలం..

మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరడంతో ఉమ్మడి జిల్లాలో ఆ పార్టీకి బలం కూడా పెరగనుంది. ఉమ్మడి జిల్లా పరిధిలో మొత్తం తొమ్మిది మంది ఎమ్మెల్యేలు ఉండగా ప్రస్తుతం నలుగురు కాంగ్రెస్ నుంచి ఉన్నారు. ఆయన చేరడం వల్ల ఆ సంఖ్య ఐదుగురికి పెరగనుంది. పార్టీ బలంతో పాటు ఉమ్మడి జిల్లాలో ఈ ప్రభావం ఉండనుంది. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా మెజార్టీ సీట్లను కైవసం చేసుకునేందుకు ఆయన చేరిక ఉపయోగపడనుంది. కాంగ్రెస్‌లో పోచారం చేరికను ఉమ్మడి జిల్లా ఆ పార్టీ నేతలు ఆహ్వానిస్తుండగా బాన్సువాడలోని మాజీ ఎమ్మెల్యే రవీందర్‌రెడ్డి వర్గం మాత్రం వ్యతిరేకిస్తుంది. ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌లో చేరిన రవీందర్‌రెడ్డి పోచారంపై పోటీ చేసి ఓడిపోయారు. ఎన్నికల తర్వాత నియోజకవర్గ ఇంచార్జిగా ఉన్న ఆయన కార్యక్రమాలు చేపట్టడంతో పాటు అన్ని పనులను ఆయన ఆధ్వర్యంలోనే కొనసాగే విధంగా చూశారు. ప్రస్తుతం ఎమ్మెల్యే పార్టీలో చేరడంతో క్యాడర్ కూడా ఎక్కువ మొత్తంలో చేరనుండటం వల్ల ఉమ్మడి జిల్లా పరిధిలోని నేతలు ఆయన చేరికను ఆహ్వానిస్తున్నారు.

రైతాంగం కోసమే కాంగ్రెస్‌లో చేరిక : పోచారం

రైతుల కోసమే తాను కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు. స్వయంగా రైతునైన తనకు కష్ట సుఖాలు తెలుసునని.. రైతులకు అండగా ఉండేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ఆహ్వానించడంతో తాను పార్టీలో చేరినట్లు తెలిపారు. ఆరు నెలలుగా కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న పనులను గమనిస్తున్నానని ఆయన తెలిపారు. కొత్త ప్రభుత్వమైన చిన్న వయస్సులోనే రేవంత్ రెడ్డి వాటిని ధైర్యంగా అధిగమించి రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తున్నాడని ఆయన తెలిపారు. రాజకీయంగా తాను ఆశించడానికి ఏమీ లేదని వ్యవసాయ శాఖ మంత్రిగా, సహకార బ్యాంక్ చైర్మన్‌గా చేశానన్నారు. తన రాజకీయ జీవితం కాంగ్రెస్ పార్టీతోనే మొదలైందని తర్వాత టీడీపీ, బీఆర్ఎస్‌లో పనిచేశానని అన్నారు. చివరకు మళ్లీ కాంగ్రెస్‌కే తిరిగి వచ్చానని ఆయన తెలిపారు. రేవంత్‌రెడ్డి ఇరవై ఏళ్ల రాష్ట్రానికి నాయకత్వం వహించే సామర్థ్యం ఉందని ఆయనను బలపరిచేందుకు ఈ నిర్ణయం తీసుకున్నానని ఆయన తెలిపారు.



సీఎంకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న పోచారం



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్



సమావేశంలో పాల్గొన్న జడ్పీ సభ్యులు, అధికారులు

నిధులు రాకున్నా.. పనులు పూర్తి చేశాం

దీన్‌దయాల్ అవార్డ్‌తో గుర్తింపు తెచ్చాం

అందరి సహకారంతో ఐదేళ్లు పూర్తి చేశాం : జడ్పీ చైర్మన్

ఖిల్లా, జూన్ 21: రాష్ట్ర ప్రభుత్వం ద్వారా జిల్లా పరిషత్‌కు రావాలసిన నిధులు రాకున్నా.. జిల్లాలో అభివృద్ధి పనులు పూర్తి చేశామని, జిల్లా పరిషత్‌కు దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చి దీన్ దయాల్ అవార్డ్‌ను పొందామని, ఇది అందరి సహకారంతోనే సాధ్యమైందని జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావ్ అన్నారు. శుక్రవారం నిర్వహించిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశానికి చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావ్ అధ్యక్షత వహించగా.. జడ్పీ సీఈవో ఉషా, అదనపు కలెక్టర్ అంకిత్, ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి, ఐసీడీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జడ్పీ చైర్మన్ మాట్లాడుతూ.. తమ హయంలో జడ్పీ ఆవరణలో రూ.50లక్షలతో వాణిజ్య సముదాయాన్ని నిర్మించడం జరిగిందన్నారు. దీనిద్వారా ప్రతినెలా జిల్లా పరిషత్‌కు అద్దె సమకూరుతుందని తెలిపారు.

ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రజాసేవకులే..

: ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి

ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రజాసేవకులుగా ఉండి ప్రజలకు సేవలందించాలన్నారు. రాజకీయాలకు, కులమతాలకు అతీతంగా ప్రజా సేవకులుగా పని చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న పాఠశాలల్లో విద్యార్థులకు కనీస వసతులు కరువయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు.

స్కానింగ్ సెంటర్లపై చర్యలు ఎందుకు తీసుకోలేదు..

జిల్లా వైద్య అధికారిని నిలదీసిన మహిళా సభ్యులు

ఇటీవల జిల్లా కేంద్రంలో స్కానింగ్ సెంటర్లలో మహిళల పట్ల జరుగుతున్న అమాయిత్యాలపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని సభ్యులు సంబంధిత శాఖ అధికారిపై మండిపడ్డారు. ఆధారాలు సేకరించి ఎందుకు సీజ్ చేయలేదని సభ్యులు అధికారిని నిలదీశారు. స్కానింగ్ సెంటర్లలో మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్న వారిపై ఎందుకు కేసులు పెట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కలెక్టర్‌కు నివేదిక ఇచ్చాము కలెక్టర్ ఆదేశాల మేరకు పని చేస్తామని చెప్పడంతో ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి అధికారిపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మహిళలకు ఇచ్చే గౌరవం ఇదేనా అని ప్రశ్నించారు. పనితీరును మార్చుకోవాలని హితవు చేశారు.

పోచారం కాంగ్రెస్‌లో చేరికను ఖండించిన ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి

నిజామాబాద్, జూన్ 21 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కాంగ్రెస్ పార్టీలో మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి చేరికను మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. అమెరికా నుంచి ఆయన ప్రకటనను విడుదల చేశారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో పోచారం శ్రీనివాస్ రెడ్డికి అత్యధిక ప్రాధాన్యం ఇచ్చారన్నారు. అన్నింటిలో ముందువరుసలో ఉంచి పదవులను కట్టబెట్టారన్నారు. వ్యవసాయ, సహకార శాఖ మంత్రిగా అవకాశం ఇవ్వడంతో పాటు శాసన సభాపతిగా సముచిత స్థానం కల్పించారన్నారు. లక్ష్మీపుత్రుడని సంబోదిస్తూ కేసీఆర్ బాన్సువాడకు అడిగినన్ని నిధులను ఇచ్చాడని ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. చెక్‌డ్యామ్‌లకు, ప్రాజెక్టులకు, రోడ్లకు, డబుల్ బెడ్‌రూం ఇండ్లకు సీఎం డెవలప్‌మెంట్ ఫండ్ నుంచి అత్యధికంగా నిధులు ఇచ్చాడన్నారు. తాను హౌసింగ్ మినిస్టర్‌గా ఉన్న అత్యధికంగా ఆయన నియోజకవర్గానికే కేటాయించానని తెలిపారు. ఇందూరు తిరుమల గుడికి అడిగినన్ని నిధులు ఇచ్చారన్నారు. ప్రాణం పోయేవరకు కేసీఆర్ వెంటే ఉంటానని ఇప్పుడు పార్టీ వదిలి వెళ్లడం ఆయన కొలిచే శ్రీనివాసుడికి పోచారం శ్రీనివాస్ రెడ్డి ఏం సమాధానం చెబుతాడని ప్రశ్నించారు. అధికారం, పదవులు లేకుంటే వెన్నుపోటు పొడిచి కాంగ్రెస్‌లో చేరడం అత్యంత బాధాకరమని, బాన్సువాడ ప్రజలు ఆలోచించాలని ప్రశాంత్‌రెడ్డి కోరారు.

లోన్ ఇస్తామంటూ డబ్బులు దండుకున్న మోసగాళ్లు

ఎల్లారెడ్డి, జూన్21: మండలంలోని మల్కాపూర్ గ్రామానికి చెందిన లింగంపేట్ బాలకృష్ణ అనే వ్యక్తికి సైబర్ నేరగాళ్లు ఫోన్ చేసి రూ.5 లక్షల లోన్ వచ్చిందని, అకౌంట్‌లో వేయాలంటే కొంత ఫీజు చెల్లించాలని చెప్పగా.. నమ్మిన బాలకృష్ణకు ఆ వ్యక్తులకు ఫోన్‌పే ద్వారా రూ.30,806 పంపాడు. రోజులు గడుస్తున్నా డబ్బులు ఖాతాలోకి రాకపోవడంతో మోస పోయానని గ్రహించిన బాలకృష్ణ ఎల్లారెడ్డి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై మహేష్ తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు లోన్లు ఇస్తామంటూ మాయమాటలు చెబితే నమ్మి మోసపోకూడదని వ్యక్తిగత సమాచారం ఎవరికీ ఇవ్వొద్దని సూచించారు.

నీట్ పరీక్షను రద్దు చేయాలి

● విద్యార్థి సంఘాల డిమాండ్

కామారెడ్డిటౌన్, జూన్21: నీట్ పరీక్షను రద్దుచేయాలని, ఎన్‌టీఏని తొలగించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలోని కొత్తబస్టాండ్ వద్ద కేంద్రప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం, ఎన్‌టీఏ అధికారులు కలిసి కుట్రపన్నిపేపర్‌లీకే జ్‌చేయడం జరిగిందని ఆరోపించారు. బీహార్, గుజరాత్ రాష్ట్రంలో పేపర్‌ని 30 నుంచి 40లక్షలకు అమ్ముకోవడం జరిగిందన్నారు. విద్యావిధానాన్ని కాపాడాల్సిన అధికారులే డబ్బులకు ఆశపడి పేద, మధ్యతరగతి కుటుంబాల పేదవిద్యార్థులను చదువుకు దూరం చేయాలని కుట్రలో భాగంగా పేపర్‌లీకేజ్ చేసినట్లు చెప్పారు. పేపర్ లీకేజీపై ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం నిమ్మకు నిరేత్తినట్లు వ్యవహరించడం సిగ్గుచేటని అన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు సందీప్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు అరుణ్, బీవీఎం రాష్ట్రకార్యదర్శి విఠల్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సురేష్, తదితరులు పాల్గొన్నారు.

'జీరో బిల్లులు ప్రతీ ఒక్కరికి వర్తింపజేయాలి'

సదాశివనగర్, జూన్ 21: ప్రభుత్వం గృహలక్ష్మి కింద 200 యూనిట్ల ఉచిత కరెంటు అందజేస్తామని వాగ్దానం చేసినా కొందరికే జీరో బిల్లులు వస్తున్నాయని, అందరికీ జీరోబిల్లులు వర్తింపజేయాలని ఎంపీటీసీ మహిపాల్ యాదవ్ కోరారు. గురువారం ఎంపీపీ గైని అనసూయ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా పలువురు ఎంపీటీసీలు సమస్యలను లెవనెత్తారు. సదాశివనగర్ మండల కేంద్రంలో ఐదు అసంపూర్తి అంగన్‌వాడి భవనాలు ఉండడంతో చిన్నారులకు సౌకర్యాలు లేని అద్దెభవనాల్లో నిర్వహిస్తున్నారని, తక్షణమే చర్య తీసుకోవాలని మండల కోఆప్షన్ సభ్యుడు అల్తాఫ్ ఎంపీడీఓకు సూచించారు. ప్రజా ప్రతినిధులు, సర్పంచ్‌లు లేకపోవడంతో చదివినట్లు చదివివినిపించి మమ అనిపించారు. ఆర్‌అండ్‌బీ శాఖ, ఎక్సైజ్‌శాఖ సమావేశానికి హజరుకాకపోవడంపై ఎంపీడీవో అసహనం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో సంతోష్‌కుమార్, జడ్పీటీసీ నర్సింలు, మండల కోఆప్షన్‌సభ్యుడు సయ్యద్‌మోహినోద్దిన్, వైస్‌ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ గంగాసాగర్ పాల్గొన్నారు.

ఎంపీ అర్వింద్‌ని కలిసిన ఐఎంఏ వైద్యులు


ఎంపీని కలిసిన ఐఎంఏ వైద్యులు

పెద్దబజార్, జూన్ 21: నిజామాబాద్ పార్లమెంట్ సభ్యుడు ఎంపీ అర్వింద్ ధర్మపురిని శుక్రవారం ఆయన నివాసంలో ఐఎంఏ వైద్యులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ దామోదర్‌రావు, ప్రధాన కార్యదర్శి కొట్టూరు శ్రీశైలం, కోశాధికారి డాక్టర్ రాజేంద్రప్రసాద్, సీనియర్ వైద్యులు రామ్మోహన్‌రావు, జయని నెప్రాలా, రమాదేవి, వినోద్‌గుప్త, డీఎల్ఎన్ స్వామి, రవీంద్రనాథ్, జలగం తిరుపతిరావు, వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకుంటుంది


రోదిస్తున్న మృతుడి కుటుంబసభ్యులు

బోధన్‌రూరల్,జూన్21: రోడ్డు ప్రమాదంలో గురువారం మృతిచెందిన బోధన్ రూరల్ విద్యుత్తు శాఖ ఏఈ రవిచంద్ర కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని టీజీ ఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి అన్నారు. శుక్రవారం బోధన్‌లో నిర్వహించిన రవిచంద్ర అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని భరోసా కల్పించారు. అనంతరం మౌనం పాటించి నివాళులు అర్పించారు. డీఈలు వెంకట రమణ, ముక్త్యార్‌ఉన్నారు.

మహిళా శక్తి అమలుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక

● కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

నిజామాబాద్ అర్బన్, జూన్ 21: మహిళలను ఆర్థికంగా మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మహిళా శక్తి కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతంగా అమలు చేసి ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగా లక్ష్యాన్ని సాధించేందుకు వీలుగా సమగ్ర కార్యచరణ ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అధికారులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని ఆయన ఛాంబర్‌లో వివిధ శాఖల అధికారులతో మహిళా శక్తి కార్యక్రమం అమలు సన్నద్ధతపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా ఉన్నతి-తెలంగాణ ప్రగతి లక్ష్యంతో వచ్చే ఐదేళ్లలో మహిళలను బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం మహిళా శక్తి ద్వారా 14 రకాల కార్యక్రమాలు చేపడుతుందన్నారు. అందులో భాగంగా పాఠశాల విద్యార్థులకు ఏకరూప దుస్తులు కుట్టు పనిని వారికే అప్పగించిందన్నారు. మహిళా శక్తి కింద మైక్రో ఎంటర్‌ప్రెన్యూర్స్, కుట్టు కేంద్రాలు, పాడి పశువులు, బ్యాక్ యార్డ్ పౌల్ట్రీ, పౌల్ట్రీ మదర్ యూనిట్స్, సంచార మత్స్య విక్రయ అవుట్ లెట్‌లు, మిల్క్ పార్లర్స్, మీసేవా, ఈవెంట్ మేనేజ్‌మెంట్, మహిళా క్యాంటీన్‌లు, ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, కస్టం హైరింగ్ కేంద్రాలు వంటి 14 రకాల కార్యక్రమాలు చేపట్టేందుకు మండలాల వారిగా కార్యచరణ రూపొందించాలన్నారు. ఇట్టి కార్యచరణ ప్రకారం వివిధ మండలాల్లోగల మహిళా సమాఖ్యలోని స్వయం సహాయక సంఘాల ద్వారా వివిధ యూనిట్లు నెలకొల్పడమే లక్ష్యంగా ఇప్పటి నుంచే కార్యచరణకు శ్రీకారం చుట్టాలన్నారు. ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికే మూడు మాసాలు గడిచినందున యూనిట్ల గ్రౌండింగ్‌కు సత్వర చర్యలు తీసుకోవాలని బ్యాంకర్లతో మాట్లాడి యూనిట్లు గ్రౌండ్ చేయాలన్నారు. రాష్ట్ర స్థాయిలో ఏర్పాటు చేస్తున్న శిక్షణ తరగతులకు ఔత్సాహికులైన క్రియాశీలక మహిళా సంఘాల సభ్యులను ఎంపిక చేయాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అంకిత్, నగర పాలక సంస్థ కమీషనర్ మకరంద్, డీఆర్‌డీవో సాయాగౌడ్, జిల్లా వ్యవసాయ అధికారి వాజీద్ హుస్సేన్, పశుసంవర్ధక శాఖ అధికారి జనార్ధనచారి, మెప్మాపీడీ రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా.. బాలిక మృతి


ట్రాక్టర్ బోల్తా ఘటనలో మృతి చెందిన బాలిక

పెద్దకొడప్‌గల్, జూన్ 21: కామారెడ్డి జిల్లా జుక్కల్ మండలం జుక్కల్ చౌరస్తా మీదుగా వెళ్తున్న జాతీయ రహదారి 161పై ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. కామారెడ్డి జిల్లా బిచ్కుంద మండల కేంద్రానికి చెందిన ఒడ్డెరులు జుక్కల్ మండలం కౌలాస్ గ్రామశివారులో ఉన్న ఎల్లమ్మకు మొక్కులు చెల్లించుకుని వస్తుండగా.. వారు ప్రయత్నిస్తున్న వెగంగా వెళ్తూ ట్రాక్టర్ బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో ఓ బాలిక మృతిచెందగా.. మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. బిచ్కుంద మండల కేంద్రానికి చెందిన ఒడ్డెరుల కుటుంబాలు శుక్రవారం జుక్కల్ మండలం కౌలాస్ గ్రామశివారులో ఉన్న ఎల్లమ్మకు మొక్కులు చెల్లించుకునేందుకు ఓ ట్రాక్టర్‌లో 20 మంది బయల్దేరారు. ఉదయం ఎల్లమ్మ ఆలయం వద్దకు చేరుకున్న వీరు అమ్మవారికి మొక్కులు చెల్లించుకుని సాయంత్రం సమయంలో తిరిగి బిచ్కుందకు వస్తుండగా వీరు ప్రయాణిస్తున్న ట్రాక్టర్ జుక్కల్ గేట్ సమీపంలోకి రాగానే అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో అంజలి (11)పై ట్రాక్టర్ ఇంజన్ పడడంతో అక్కడికక్కడే మృతిచెందింది. ఈ ఘటనలో మరో నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. ప్రమాదం విషయం తెలుసుకున్న హైవే సిబ్బంది, పెద్దకొడప్‌గల్ ఎస్సై కోనారెడ్డి ఘటనా స్థలికి చేరుకుని క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. ట్రాక్టర్ ఇంజన్ కింద ఉన్న బాలిక మృతదేహాన్ని క్రేన్‌ను సహాయంతో బయటికి తీశారు. మృతురాలి తండ్రి గురువు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జుక్కల్ ఎస్సై సత్యనారాయణ తెలిపారు.

నేడు నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశం

సుభాష్‌నగర్, జూన్ 21: నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశాన్ని శనివారం నిర్వహించనున్నారు. జిల్లా కేంద్రంలోని నూతన మున్సిపల్ కార్యాలయంలో నగర మేయర్ దండు నీతూకిరణ్ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించనున్నారు. ఉదయం 11గంటల నుంచి సమావేశాన్ని నిర్వహించనున్నారు. ఈ సమావేశానికి అధికారులు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేశారు. కౌన్సిల్ సమావేశానికి అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్త హాజరుకానున్నారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు కౌన్సిల్ సమావేశంలో మెజార్టీ కార్పొరేటర్లు బీఆర్ఎస్‌కు అనుకూలంగా ఉన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే తొలత బీజేపీలో ఉన్న నాయకులు మళ్లీ బీజేపీ పార్టీలో చేరారు. దీంతో బీజేపీ పార్టీకి 26 మంది కార్పొరేటర్లు అయ్యారు. గత కౌన్సిల్ సమావేశంలో మెజార్టీ లేకపోవడంతో బీజేపీ కార్పొరేటర్లు సమస్యలు లేవనెత్తిన పట్టించుకోలేదు. ప్రస్తుతం ఎక్కువ మొత్తంలో మెజార్టీ బీజేపీకి ఉండటంతో సమస్యలపై గళం ఎత్తే అవకాశం ఉంది. నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశాలు ప్రతీసారి తూతూ మంత్రంగానే జరిగాయి. గతంలో అధికార పార్టీకి సంబంధించిన కార్పొరేటర్లు ఎక్కువగా ఉండటంతో సమస్యలను వినిపించేలోపే గొడవలు జరిగేవి. చివరకు మెజార్టీ అభిప్రాయంతో ఎజెండా అంశాలను ఆమోదించేవారు. ప్రస్తుతం మెజార్టీ సభ్యులు బీజేపీ వారు కావడంతో అభివృద్ధిపై గట్టిగా చర్చ జరిగేందుకు అవకాశం ఉంది. బీజేపీ కార్పొరేటర్లు నగర అభివృద్ధికి జనరల్ ఫండ్‌ను ఇవ్వాలన్న డిమాండ్‌ను వినిపించనున్నారు. గత పాలనలో డివిజన్‌కు కోటి రూపాయల నిధులపై చర్చించేందుకు పట్టుబట్టనున్నారు. అంతేకాకుండా ప్రజాపాలన దరఖాస్తులు కొత్త రేషన్‌కార్డులు, గృహజ్యోతిపై చర్చలేవనెత్తే అవకాశం ఉంది. గత సమావేశాల్లాగే చర్చ జరుగకుండానే మమా అనిపిస్తారా అనేది వేచి చూడాలి. నగరంలో అక్రమ కట్టడాలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నా వాటిపై చర్యలు తీసుకోవడం లేదని ప్రధానంగా టౌన్‌ప్లానింగ్ విభాగంపై ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత కొంతకాలంగా టౌన్‌ప్లానింగ్ అధికారులపై అనేక ఆరోపణలు ఉన్నా వీరిపై చర్యలు తీసుకోవడం లేదంటూ సోషల్ మీడియాలో ఆరోపణలు వస్తున్నాయి. నగర పాలక సంస్థలో 9 నుంచి 10 సంవత్సరాల పాటు ఒకేచోట పనిచేస్తున్నారని అనేక ఫిర్యాదులు వస్తున్నాయి. మున్సిపల్ ఉన్నతాధికారులతో పాటు జిల్లా కలెక్టర్‌కు టౌన్‌ప్లానింగ్ అధికారులపై ఫిర్యాదులు వెళ్లాయి. వీటిపై ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. కౌన్సిల్ సమావేశంలోనైనా టౌన్ ప్లానింగ్ అధికారులపై బీజేపీ కార్పొరేటర్లు చర్చకు లేవనెత్తనున్నారు. దీనికి అధికార పక్షం చర్చకు అవకాశం ఇస్తారా అనేది తేలనుంది.

బీజేపీ నేతలు తమ వైఖరిని మార్చుకోవాలి

● టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గడుగు గంగాధర్

నిజామాబాద్ అర్బన్, జూన్ 21: రాష్ట్ర ప్రభుత్వంచే నియమించబడి ప్రభుత్వ సలహాదారు హోదాలో అధికారులతో షబ్బీర్‌అలీ సమీక్ష నిర్వహిస్తే బీజేపీ నేతలు జీర్ణించుకోలేక విమర్శలు చేయడం సరికాదని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గడుగు గంగాధర్ అన్నారు. ప్రభుత్వంలో హోదాలో ఉన్న వ్యక్తి ప్రజల సమస్యల గురించి సమావేశాలు నిర్వహించడం సాధారణమన్నారు. శుక్రవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం షబ్బీర్ అలీని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సలహాదారుగా నియమించారని, అలాంటప్పుడు ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు అధికారులతో సమీక్షించడం సర్వసాధారణమని, అది జీర్ణించుకోకుండా అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ విమర్శలు చేయడం సరికాదన్నారు. ముందుగా ఎమ్మెల్యే తన ప్రవర్తనను మార్చుకొని అభివృద్ధిపై దృష్టి పెట్టాలన్నారు. ప్రభుత్వ సలహాదారు హోదాలో సమీక్ష పెట్టే అర్హత షబ్బీర్ అలీకి ఉందని రాజకీయాలు మాని అర్బన్ అభివృద్ధిపై ఎమ్మెల్యే దృష్టి పెడితే బాగుంటుందన్నారు. అర్బన్ నియోజకవర్గంలో ఓడినప్పటికీ షబ్బీర్ అలీ నియోజకవర్గ సమస్యలను పరిష్కరించేందుకు ప్రజలకు సేవ చేసేందుకు క్యాంప్ ఆఫీస్‌ను ప్రారంభిస్తే దానిపై విమర్శలు చేయడం సరికాదన్నారు. ధన్‌పాల్ సూర్యనారాయణ బీజేపీ ఎమ్మెల్యే కాదని అర్బన్ ఎమ్మెల్యే అని ప్రజలను రెచ్చగొట్టి ఎన్నికల్లో లబ్ధి పొందడమే కాకుండా ఇప్పుడు కూడా ప్రజలను తప్పుదోవ పట్టించాలని ప్రయత్నం చేస్తున్నాడని అన్నారు. రాజకీయాలు మాని నియోజకవర్గంలో ఉన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అభివృద్ధికి కృషిచేయాలని తాము కూడా సహకరిస్తామన్నారు. రాజకీయ పరిజ్ఞానం లేకుండా ప్రభుత్వం వచ్చిన ఆరునెలల్లో ఏమి చేసిందని కాంగ్రెస్ పార్టీపై విమర్శలు చేస్తున్నారని మూడునెలలు ఎన్నికల కోడ్ ఉంటే ఎలా అభివృద్ధి పనులు సాధ్యమో జవాబు చెప్పాలన్నారు.

పాఠశాలల్లో ఘనంగా యోగా దినోత్సవం


ఫ్యూచర్ లైన్ కిడ్స్ పాఠశాలలో యోగా చేస్తున్న విద్యార్థులు


విశ్వవికాస్ పాఠశాలలో యోగా చేస్తున్న విద్యార్థులు

నిజామాబాద్ అర్బన్, జూన్ 21: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం నగరంలోని పలు పాఠశాలలు, స్వచ్ఛంద సంస్థల్లో ఘనంగా యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. నగరంలోని కంఠేశ్వర్ బైపాస్ రోడ్‌లోగల స్నేహ సొసైటీలో నిర్వహించిన అంతర్జాతీయ యోగా దినోత్సవం కార్యక్రమంలో నగర మేయర్ నీతూకిరణ్, జిల్లా మహిళా శిశుసంక్షేమ అధికారిణి రసూల్‌బీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ శారీరకంగా మానసికంగా దృఢంగా ఉండేందుకు యోగా అనేది పూర్వీకులు మనకు ఇచ్చిన గొప్ప వరమన్నారు. ఈ సందర్భంగా మానసిక దివ్యాంగ విద్యార్థులు యోగాసనాలు చేసి అబ్బురపరిచారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జ్యోతి, కార్యదర్శి సిద్ధయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఫ్యూచర్ లైన్ కిడ్స్ స్కూల్‌లో...

నగరంలోని ఆర్యనగర్‌లోగల ఫ్యూచర్ లైన్ కిడ్స్ స్కూల్‌లో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన యోగాసనాలు ఆకట్టుకున్నాయి. చిన్నప్పటి నుంచే విద్యార్థులకు యోగా నేర్పడం ద్వారా వారు దృఢంగా మారే అవకాశం ఉందని ప్రిన్సిపల్ ప్రియాంక అన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విశ్వవికాస్ పాఠశాలలో...

నగరంలోని సాయినగర్‌లోగల విశ్వవికాస్ పాఠశాలలో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని పాఠశాల మైదానంలో విద్యార్థులు యోగా, వివిధ ఆసనాలను ప్రదర్శించారు. యోగా వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయని మనస్సును, శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుకునేందుకు యోగా ఉపయోగపడుతుందని పాఠశాల కరస్పాండెంట్ అప్పారావు, ప్రిన్సిపల్ సుస్మితలు అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన యోగాసనాలు ఆకట్టుకున్నాయి.

నిశిత ఇంటర్నేషనల్ స్కూల్‌లో...

నగరంలోని అమ్మ వెంచర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన నిశిత ఇంటర్నేషనల్ పాఠశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులచే పలు యోగాసనాలు ప్రదర్శింపజేశారు. యోగా వల్ల కలిగే ప్రయోజనాలను చిన్నారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



నిశిత ఇంటర్నేషనల్ స్కూల్‌లో యోగా చేస్తున్న చిన్నారులు



యోగా దినోత్సవంలో మాట్లాడుతున్న మేయర్ నీతూకిరణ్

కందకుర్తిలోని శ్రీరామార్చనలో పాల్గొన్న అర్బన్ ఎమ్మెల్యే

రెంజల్,జూన్21: మండలంలోని కందకుర్తి త్రివేణి సంగమ క్షేత్రం గోదావరి తీరన శుక్రవారం ఏరువాక పౌర్ణమి సందర్భంగా అయోధ్య సీతారాం త్యాగి మహరాజ్ ఆశ్రమం నందు పౌర్ణమి సందర్భంగా శ్రీరామార్చన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఏరువాక పౌర్ణమి సందర్భంగా ఆశ్రమంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చుట్టుపక్కల గ్రామ ప్రజలు యజ్ఞంలో పాల్గొన్నారు. భక్తుల సౌకర్యార్థం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

24 నుంచి జూనియర్ డాక్టర్ల సమ్మె


సమ్మె నోటీసు అందజేస్తున్న వైద్యులు

పెద్దబజార్, జూన్ 21: తమ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 24 నుంచి సమ్మె నిర్వహిస్తున్నట్లు జూనియర్ డాక్టర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ చంద్రకాంత్ తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని మెడికల్ కళాశాల వైస్ ప్రిన్స్‌పాల్ డాక్టర్ నాగమోహన్, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమరాజ్‌కు సమ్మె నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నెలలో తాత్కాలికంగా నిలిపివేసిన సమ్మెను తిరిగి కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు. తక్షణమే స్పందించి తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ సురేష్, జూనియర్ డాక్టర్లు పాల్గొన్నారు.

జీఎంసీకి రేడియోలజీ పీజీ సీట్లు

పెద్దబజార్, జూన్ 21: నిజామాబాద్ ప్రభుత్వ మెడికల్ కళాశాలకు రేడియోలజీ విభాగంలో అదనంగా 5 పీజీ సీట్లు మంజూరైనట్లు వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఇందిర శుక్రవారం తెలిపారు. ఈ మేరకు ఎంసీఐ ఉత్తర్వులు జారీ చేసిందని పేర్కొన్నారు. సీట్ల మంజూరుతో ప్రజలకు రేడియోలజీ విభాగంలో మరింత మెరుగైన సేవలు అందుతాయన్నారు.

కోటగిరిలో పోచారం దిష్టిబొమ్మ దహనం


దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కోటగిరి,జూన్21: మండల కేంద్రంలో శుక్రవారం కాంగ్రెస్‌పార్టీ నాయకులు ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. పోచారం శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలోకి రావడాన్ని నిరసిస్తూ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గంగాధర్ రావు దేశాయ్ మాట్లాడుతూ మాజీ స్పీకర్ పోచారం అధికార పార్టీలోకి రావడం తన ఆనవాయితీగా మార్చుకున్నారని విమర్శించారు. పోచారం సుదీర్ఘ రాజకీయ జీవితంలో ప్రతిపక్ష నాయకులు, ద్వితీయ శ్రేణి నాయకులు ఎంతగానో నలిగిపోయారని పేర్కొన్నారు. రాజకీయ లబ్ధి కోసం తన అక్రమ ఆస్తులను కాపాడుకోవడానికే పార్టీలోకి వస్తున్నారని ఆరోపించారు. ఆయన విషయంలో అధిష్టానం పునరాలోచించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్ రావు, అనంత్, వహీద్, భీమా సాయిరెడ్డి, జంగం సాయిలు, బర్ల సాయిలు పాల్గొన్నారు.

మాజీ స్పీకర్ పోచారం వెంటే మేమంతా..

● కోటగిరిలో బీఆర్ఎస్ నాయకుల ప్రకటన


కోటగిరిలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ కార్యకర్తలు

కోటగిరి,జూన్21: బాన్సువాడ ఎమ్మెల్యే, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి వెంట తాము నడుస్తామని కోటగిరి ఉమ్మడి మండలాల బీఆర్ఎస్ నాయకులు స్పష్టం చేశారు. కోటగిరి మండలంలోని ఎక్లాస్‌పూర్ క్యాంప్‌లోని ఓ రైస్‌మిల్లులో శుక్రవారం ఆ పార్టీ నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షులు ఎజాజ్‌ఖాన్ మాట్లాడుతూ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరడాన్ని తామంతా ఏకగ్రీవంగా స్వాగతిస్తున్నామన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం పోచారం కాంగ్రెస్ పార్టీలో చేరారని ఆయన పేర్కొన్నారు. బాన్సువాడ నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసినప్పటికీ ఇంకా మరింత అభివృద్ధి చేయాల్సి ఉందన్నారు. కాంగ్రెస్ అధిష్టానం సైతం పోచారం సీనియారిటీని గుర్తించి ఆయనను పార్టీలోకి స్వాగతించిందన్నారు. తామంత పోచారం వెంటే నడుస్తామని స్పష్టం చేశారు. అనంతరం మండల కేంద్రంలోని ఎన్‌టీఆర్ చౌరస్తాలో టపాకాయలు కాలుస్తూ స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో జడ్పీటీసీ శంకర్ పటేల్, మాజీ ఏఎంసీ చైర్మన్ వహీద్, జడ్పీ కోఆప్షన్ మెంబర్ సిరాజ్, విండో అధ్యక్షులు సిద్దు, శాంతేశ్వర్ పటేల్, అశోక్ పటేల్, తాజామాజీ సర్పంచ్‌లు సాయిబాబా, వర్ని శంకర్, నాయకులు హంగర్గ గంగాధర్, జుబేర్, సబేర్, నాగరాజు గౌడ్, రఫీ, సాదుల రమేష్, బాబు ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో లేగదూడ మృతి

తాడ్వాయి, జూన్ 21: మండలంలోని కరడ్‌పల్లిలో శుక్రవారం కుక్కల దాడిలో గ్రామానికి చెందిన మర్రినిఖిల్ లేగదూడ మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామంలో కుక్కల దాడి పెరిగిపోయిందని ఈ విషయమై అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పశువులతో పాటు మనుషులపైన దాడిచేస్తున్నాయని తెలి పారు.

జయశంకర్ వర్ధంతిని మర్చిపోవడం సరికాదు


నివాళి అర్పిస్తున్న వైద్యనిపుణులు కేశవులు

పెద్దబజార్, జూన్ 21 : ప్రత్యేక తెలంగాణ కొరకు తన జీవితాన్ని పూర్తిగా త్యాగం చేసిన జయశంకర్ వర్ధంతిని అధికార, ప్రతిపక్ష నేతలు పట్టించుకోకపోవడం దారుణమని ప్రముఖ మానసిక వైద్య నిపుణులు డాక్టర్ బి.కేశవులు అన్నారు. శుక్రవారం జయశంకర్ వర్ధంతిని కంఠేశ్వర్ చౌరస్తాలో గల జయశంకర్ విగ్రహానికి పూలమాల వేసి, నివాళులు అర్పించారు. అనంతరం డాక్టర్ కేశవులు మాట్లాడుతూ సార్ చరితను భవిష్యత్తు తరాలకు తెలియపర్చాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో శ్రామిక శక్తి ఎడిటర్ రేపల్లి శ్రీనివాస్, అడ్వకేట్ సుదర్శన్ రావు, నిజామాబాద్ అభివృద్ధి వేదిక సెక్రెటరీ నర్సయ్య, రమేష్ ఉన్నారు.

జాన్కంపేట్‌లో ఉర్దూ పాఠశాల తనిఖీ

ఎడపల్లి జూన్ 21: మండలంలోని జాన్కంపేట ఉర్దూపాఠశాలలో 35 మంది విద్యార్థులకు నలుగురు ఉపాధ్యాయులున్నారు. కాని 17 మందే హాజరు కావడం ఏమిటని జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్ అన్నారు. శుక్రవారం ఎడపల్లి మండలం జానకంపేటలో ప్రభుత్వ పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.

బాధితుడి కుటుంబానికి ఎల్ఓసీ అందజేత

కమ్మర్‌పల్లి, జూన్ 21:మండలంలోని హసాకొత్తూర్ గ్రామానికి చెందిన భూమన్న అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో మెరుగైన చికిత్స నిమిత్తం చేరాడు. వైద్యచికిత్సల నిమిత్తం మూడులక్షల 75 వేల ఎల్ఓసీ ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ ముత్యాల సునీల్‌కుమార్ మంజూరు చేయించగా దాని ప్రతిని శుక్రవారం బాధితుడి కుటుంబసభ్యులకు అందజేశారు.

మోడల్‌స్కూల్‌లో దరఖాస్తులకు ఆహ్వానం

సిరికొండ జూన్ 21 : మోడల్ స్కూల్లో ఇంటర్మీడియట్ విద్యార్థులకు విద్యాబోధన చేయడానికి అర్హులైన వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్స్‌పాల్ శ్రీనివాస్ తెలిపారు. గంటల ప్రాతిపదికన పనిచేయడానికి పీ.జీ బీఈడీ అర్హత గల పీజీటీ రసాయన శాస్త్రం బోధించేందుకు దరఖాస్తులు చేసుకోవచ్చని ఆయన కోరారు. ఆసక్తి గల వారు 25.6.24లోపు పాఠశాలలో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. వివరాలకు 9866665604నంబర్‌కు సంప్రదించాలని ప్రిన్స్‌పాల్ తెలిపారు.

'పాఠశాల అభివృద్ధికి సహకరించండి'

సిరికొండ జూన్ 21 : హైస్కూల్ అభివృద్ధికి సహకరించాలని ప్రధానోపాధ్యాయులు సతీష్‌కుమార్ యువకులను, పాఠశాల పూర్వవిద్యార్థులను కోరారు. శుక్రవారం సిరికొండ హైస్కూల్‌కు స్థానికంగా ఉన్న యువకులు, పూర్వవిద్యార్థులను పిలిపించి పాఠశాల పరిస్థితిని వివరించారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య గత ఏడాది కంటే ఈసారి పెరిగిందన్నారు. విద్యార్థులకు ఒకేషనల్ కోర్సు, సెల్ఫ్‌డిఫెన్స్, స్పోకెన్ ఇంగ్లీష్ విద్యాబోధన ప్రారంభిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయులు వివరించారు. పాఠశాలకు గ్రామానికి చెందిన విద్యార్థులను చేర్పే విధంగా ప్రోత్సహించాలని ఆయన కోరారు. వేదికపైన స్టీల్ రేకులను ఏర్పాటు చేయించే విధంగా సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. యువకులు సైతం తమ వంతుగా పాఠశాల కోసం అన్ని విధాలుగా సహకరిస్తామన్నారు.

మోదీ చిత్రపటానికి పాలాభిషేకం

సిరికొండ జూన్ 21 : రైతులు పండించిన అన్ని పంటలకు కనీస మద్దతు ధరను ప్రకటించినందుకు భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీకి సిరికొండ మండల కేంద్రంలో బిజెపి నాయకులు పాలాభిషేకం చేశారు. బిజెపి మండల అధ్యక్షులు అల్లూరి రాజేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో నరేంద్రమోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేసి అనుకూలంగా నినాదాలు చేశారు. ప్రధాని ప్రకటించిన మద్దతు ధరల వల్ల రైతాంగానికి ఎంతో మేలు జరుగుతుందని రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో బిజెపి ఓబీసీ మోర్చ రాష్ట్ర కార్యదర్శి రామస్వామి, బిజెపి జిల్లా కార్యదర్శి నక్క రాజేశ్వర్, బిజెవైఎం మండల అధ్యక్షులు రంజిత్‌రెడ్డి, ఎస్సీమోర్చ మండల అధ్యక్షులు సంద్ర శంకర్,కనగందుల గోపి, గంగారెడ్డి, గోపి పాల్గొన్నారు.

ఎంపీ అరవింద్‌పై మండిపడ్డ కాంగ్రెస్ నాయకులు

బోధన్‌రూరల్,జూన్21: నిజామాబాద్ పార్లమెంట్ సభ్యుడు ధర్మపురి అరవింద్ బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డిపై చేసిన అనుచితవ్యాఖ్యల పట్ల కాంగ్రెస్ నేతలు శుక్రవారం బోధన్‌లో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇరిగేషన్ గెస్ట్‌హౌస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా అధ్యక్షులు మానాలమోహన్ రెడ్డి మాట్లాడుతూ ఎంపీ అరవింద్ స్థాయి మరిచి వ్యవహరిస్తున్నాడని, నోరు అదుపులో పెట్టుకోవాలని హెచ్చరించారు. ఎన్నికలలో హిందువులు కూడా కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసిన సంగతిని గుర్తుచేశారు. ఎన్నికల సమయంలో ఓట్లకోసం డబ్బులు పంపిణీ చేసిన ఘనత ఎంపీ అరవింద్‌దేనన్నారు. ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డిని విమర్శిస్తే ఊరుకునేది లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్, పట్టణ అధ్యక్షులు పాషా మొయినోద్దీన్, శరత్ రెడ్డి పాల్గొన్నారు.

ముప్కాల్-602) ఆలయ నిర్మాణానికి విరాళం అందజేస్తున్న ఎంపీటీసీ నాయకుడు పద్మకిషన్

ఆలయ నిర్మాణానికి రూ.2లక్షల 11వేల116విరాళం

ముప్కాల్, జూన్21: మండల కేంద్రంలో నిర్మిస్తున్న శుక్రవారందేవి అమ్మవారి ఆలయ నిర్మాణానికి పలువురు దాతలు విరాళాలు అందజేశారు. శుక్రవారం దేవి ఆలయ నిర్మాణానికి శుక్రవారం ఎంపీటీసీ నాయకుడు పద్మకిషన్ రూ.2లక్షల 11వేల 116లను ఆలయ కమిటీ సభ్యులకు విరాళంగా అందజేశారు. ఆలయ అభివృద్ధి తనవంతు సహాయ సహకారం అందజేస్తామని ఆయన అన్నారు. కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాయకుడు సంతోష్, ఆలయ కమిటీ సభ్యులు, ఎర్రోల్ల విజయ్, కంచు గంగాధర్, కుమ్మరి భూమన్న, నర్సయ్య, గోపు రమేష్, తదితరులు పాల్గొన్నారు.

సిద్దులగుట్టను సందర్శించిన సిద్దేశ్వర మహరాజ్

ఆర్మూర్‌రూరల్, జూన్21: పట్టణంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం సిద్దులగుట్టను శుక్రవారం సిద్దిపేట శ్రీ రాజయోగి సిద్దేశ్వర మహరాజ్ సందర్శించారు. శివాలయం, రామాలయాలను సందర్శించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్దులగుట్ట ఎంతో గొప్పక్షేత్రమని, అత్యంత శక్తి గల ప్రాంతమని కొనియాడారు. ఇలాంటి శక్తివంతమైన క్షేత్రంలో తెలంగాణ రాష్ట్రంలోనే అతిపెద్ద రెండో పిరమిడ్ శ్రీ నవనాథ సిద్దేశ్వర పిరమిడ్ ధ్యాన మహాశక్తి క్షేత్రాన్ని నిర్మించడం గొప్పవిషయమన్నారు. కార్యక్రమంలో పీఎస్ఎస్ఎం నిజామా బాద్ జిల్లా అధ్యక్షుడు సాయికృష్ణరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు సుమన్, కొడిగెల మల్లయ్య, బొడ్డుదయానంద్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ లాభాల బాటకు కృషిచేయాలి

బోధన్‌రూరల్,జూన్21: ఆర్టీసీ లాభాల బాటలో నడవడానికి ఆర్టీసీ ఉద్యోగులు, సిబ్బంది ప్రతిఒక్కరు కృషి చేయాలని కరీంనగర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. శుక్రవారం బోధన్ ఆర్టీసీ డిపోను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ డిపోలోని అన్ని విభాగాలను పరిశీలించారు. కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం మహిళల సంక్షేమం కోసం ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించిందన్నారు. ఆర్టీసీని లాభాల బాటలోకి తేవడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు.

ఊట్‌పల్లి ఊరచెరువు అలుగును బాగు చేయిస్తాం

బోధన్‌రూరల్,జూన్21: మండలంలోని ఊట్‌పల్లిలోని ఊరచెరువు అలుగు తూము పాడైపోవడంతో వర్షాకాలం దృష్ట్యా రైతులకు ఇబ్బందులు కలగకుండా ఉండడానికి మరమ్మతులు చేయిస్తానని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి హామీ ఇచ్చారు. ఊట్‌పల్లి గ్రామస్థులు శుక్రవారం బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి దృష్టికి ఊర చెరువు అలుగు తూము విషయాన్ని తీసుకురావడంతో వెంటనే స్పందించిన ఎమ్మెల్యే నీటి పారుదల శాఖ అధికారికి మరమ్మతుల విషయమై ఆదేశాలు జారీ చేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అందరికీ అండగా ఉంటుంది

- నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

మోపాల్, జూన్ 21: రైతులు, మహిళల ఆర్థిక అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎంతో కృషిచేస్తున్నారని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి అన్నారు. శుక్రవారం మోపాల్ మండల కేంద్రంలో సుమారు 10కోట్ల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న ఫోర్‌లైన్ రోడ్డు విస్తరణ పనులు, సెంట్రల్ లైటింగ్ పనులకు ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ కేసీఆర్ రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారని మండిపడ్డారు. చేసిన అప్పులను పూడ్చడానికి సీఎం రేవంత్‌రెడ్డి శతవిధాలుగా ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. కేసీఆర్ పదేళ్ల కాలంలో చేసిన అభివృద్ధి అంటూ ఏమీ లేదని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రభుత్వ పాఠశాల మరమ్మతుల కోసం రాష్ట్రవ్యాప్తంగా 2వేల కోట్ల రూపాయలను మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత కరెంటు, 500లకే గ్యాస్ వంటి పథకాలను ప్రజలకు చేరవేయడం జరిగిందని అన్నారు. మోపాల్ మండలం ఏర్పడినప్పటికి ఇక్కడ అభివృద్ధి శూన్యమని అన్నారు. మండలంలో రోడ్ల విస్తరణ పనుల కోసం కోట్ల రూపాయలను వెచ్చించడం జరిగిందని వివరించారు. ఇందులో భాగంగానే ముదక్‌పల్లి నుంచి కులాస్‌పూర్ వరకు రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించడం జరిగిందన్నారు. ముదక్‌పల్లి, బాడ్సి వద్ద బ్రిడ్జి నిర్మాణం పనులకు భూమిపూజ చేసుకోవడం జరిగిందని అన్నారు. ప్రజలు కాంగ్రెస్ పార్టీకి అండగా ఉండాలని కోరారు. 15 ఆగస్టు నాడు రైతులకు 2లక్షల రూపాయలు రుణ మాఫీ చేయడం జరుగుతుందని తెలిపారు. పేద ప్రజలకు ప్లాట్లు ఇవ్వడంతో పాటు ఇండ్ల నిర్మాణం చేపట్టడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ లత, కాంగ్రెస్ నాయకులు ముప్ప గంగారెడ్డి, చంద్రశేఖర్‌గౌడ్, యాదగిరి, గోర్కంటి లింగం, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సాయారెడ్డి, సొసైటీ చైర్మన్లు మోహన్ రెడ్డి, గంగారెడ్డి, ఆయా గ్రామాల ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత



సన్మానం చేస్తున్న నాయకులు



ఆర్మూర్‌లో యోగాసనాలు వేస్తున్న యువకులు

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్‌కుమార్
- జిల్లా అంతటా ఘనంగా యోగా దినోత్సవం

పెద్దబజార్, జూన్ 21: యోగా అంటే కేవలం శారీరక శ్రమ మాత్రమే కాదని, మానసిక ప్రశాంతత లభిస్తుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్‌కుమార్ అన్నారు. శుక్రవారం నగరంలోని బీజేపీ కార్యాలయంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా యోగా గురువులు శ్రీరామచంద్ర, శ్రీనివాస్, అంజనేయులు, ప్రశాంత్, హారతిలకు సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనుషులలో ఉన్నటువంటి ఒత్తిడిని, ఆందోళనను తగ్గించి వారిని నిరాశ, నిస్పృహల నుంచి బయటకు తీసుకురావడానికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు న్యాలం రాజు, లక్ష్మీనారాయణ, భరత్‌భూషన్, కిషన్, నారాయణయాదవ్, కిశోర్ పాల్గొన్నారు.

పెద్దబజార్, జూన్ 21:ప్రతిఒక్కరు వ్యక్తిగతంగా యోగాచేస్తే సంపూర్ణ ఆరోగ్యంగా అవుతారని డీఎంహెచ్‌వో డాక్టర్ తుకారాం రాథోడ్ అన్నారు. ఆయుష్, నెహ్రూ యువకేంద్ర దయానంద యోగా కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని బస్వాగార్డెన్‌లో 10వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఆయుష్ అధికారి డాక్టర్ రామ్మోహన్ రావు, వైద్యులు వెంకటేశ్ పాల్గొన్నారు.

రుద్రూరు:దశాబ్ది 10వ అంతర్జాతీయ యోగా ఉత్సవాలను శుక్రవారం రుద్రూరు మండల కేంద్రంలోని పద్మశాలి సంఘంలో ఉదయం 5.30 గంటల నుంచి 7.30 గంటల నిర్వహించారు. కార్యక్రమంలో రుద్రూరు మాజీసర్పంచ్ తోట శంకర్, పతంజలి సోషల్‌మీడియా రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ విశ్వనాథ్ మహాజన్ మాట్లాడారు.

సుభాష్‌నగర్:నగరంలోని దయానంద్ యోగా సెంటర్‌లో యోగా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ వెంకటరమణ, ఇప్కా ల్యాబరేటరీ మేనేజర్ రవి, తదితరులు పాల్గొన్నారు.

భీమ్‌గల్ రూరల్:పట్టణంలోని శ్రీ సరస్వతి విద్యామందిర్‌లో శుక్రవారం యోగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యోగా గురువు పిట్ల బాపూరావ్ యువకులతో యోగాసనాలు వేయించారు.

కమ్మర్‌పల్లి: ఆయురారోగ్యాలు కలిగి ఉండాలంటే యోగా సాధన అత్యుత్తమమైన మార్గమని కమ్మర్‌పల్లి మండల విద్యాధికారి ఎన్ ఆంధ్రయ్య అన్నారు. ప్రపంచ యోగాదినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని చౌట్‌పల్లి ఉన్నత పాఠశాలలో యోగాధ్యానం, యోగాఆసనాలపై అవగాహన కల్పించారు.

ముప్కాల్: బాల్కొండ ఉమ్మడి మండలాల్లోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్కొండలోని కృష్ణవేణి పాఠశాలలో వైఏజీపీ ఆకారంలో విద్యార్థుల విన్యాసాలు అలరించాయి.

బోధన్‌రూరల్:పట్టణంలోని పలు వీధుల గుండా యోగా విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం టీటీడీ కల్యాణ మండపంలో యోగా పోటీలు నిర్వహించారు. విజయసాయి పాఠశాలలో బోధన్ ఏసీపీ శ్రీనివాస్ మాట్లాడుతూ యోగా అనేది ప్రతి వ్యక్తికి అవసరం అని, యోగా మన దినసరిలో ఒక భాగమని, ప్రతి విద్యార్థి యోగాను అలవాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బోధన్ ఆర్డీవో రాజేశ్వర్, యోగా మాధవి, ఉదయ్ మహరాజ్, విద్యావికాస్ శ్రీనివాస్, ఇందూర్ విద్యాసంస్థల చైర్మన్ కొడాలి కిషోర్ కుమార్ ఆర్య సమాజ్ ప్రముఖులు ప్రదీప్ గుప్తా నిర్వాహకులు పాల్గొన్నారు.

సిరికొండ:హైస్కూలు మైదానంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న బిజెపి మండల అధ్యక్షులు రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ యోగాసనాలు చేయడం వల్ల మానవులు ఆరోగ్యవంతులుగా ఉంటారని అన్నారు. మానసిక, శారీరక ధృడత్వం పెరుగుతుందన్నారు బిజెపి నాయకులు కె.గోపి,సంద్ర శంకర్, ఎస్.గోపి, మారుతి, మాలవత్ రాజేందర్,బాబురావు,ఒడ్డెన్న తదితరులు ఉన్నారు.

ఎడపల్లి:అంతర్జాతీయ యోగా ఉత్సవాలను శుక్రవారం ఎడపల్లి మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు ఏఆర్పీ క్యాంప్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, పలువురు యోగాసనాలు చేశారు. కార్యక్రమంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా మాస్టర్ క్రాంతి కుమార్, శ్రీనివాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాయిలు, రమేష్, ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

ఆర్మూర్‌రూరల్:మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి విజయ్ హైస్కూల్‌లో విద్యార్థులు వివిధ రకాల యోగా విన్యాసాలను ప్రదర్శించారు. అదే విధంగా పెర్కిట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఘనంగా యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులందరు ఆంగ్ల అక్షర ఆకారంలో కూర్చొని యోగా ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కవిత దివాకర్, ఎం.శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌టౌన్ :తెలంగాణ రాష్ట్ర మహిళ డిగ్రీ కళాశాలలో విద్యార్థినిలు పలు యోగాసనాలు వేశారు. అనంతరం ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ర్యాలీ నిర్వహించి యోగా వల్ల లాభాలు ప్రజలకు వివరించారు. రక్ష స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విద్య హైస్కూల్‌లో యోగామాస్టర్‌లు హిమ బిందు, రాజేందర్ ఆధ్వర్యంలో యోగాసనాలు వేశారు. కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో గురుకుల మహిళాడిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ధనవేణి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వేణుగోపాలస్వామి, రక్ష స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఖాందేశ్ శ్రీనివాస్, అధ్యాపకులు పాల్గొన్నారు.

పెర్కిట్:పట్టణంలోని హౌజింగ్‌బోర్డు కాలనీలో గల పార్క్‌లో యోగా అసనాలు వేశారు. వాకర్ అసోసియేషన్ సభ్యుడు మనోహర్ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు యోగా చేయాలని ఆరోగ్యంగా ఉండాలని అన్నారు.



బోధన్‌లో చిన్నారుల యోగా



కమ్మర్‌పల్లిలో...

జయశంకర్ సార్‌కు ఘన నివాళి



చౌట్‌పల్లిలో జయశంకర్ వర్ధంతిలో పాల్గొన్న సంఘం సభ్యులు

కమ్మర్‌పల్లి, జూన్ 21: ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ సార్ 13వ వర్ధంతిని చౌట్‌పల్లి గ్రామంలో విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం తెలంగాణ ఉద్యమంలో ఆయన పాత్ర, తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు కడార్ల రాములు, కార్యదర్శి గుండోజి వేంకటేష్, కోశాధికారి పోలపల్లి రవిందర్, కమిటి సభ్యులు పాల్గొన్నారు.

సిరికొండ : తెలంగాణ పితామహుడు ఆచార్య తెలంగాణ ఉద్యమానికి ఊపిరిలు ఊదిన గొప్ప సిద్ధాంత కర్త అని సత్యశోధక్ ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షులు ఆర్.నర్సయ్య అన్నారు. ఆచార్య జయశంకర్ సార్ 13వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం సిరికొండలో ఆయన చిత్రపటానికి నర్సయ్య పూలమాల వేసిన ఘనంగా నివాళులు అర్పించారు.

వేల్పూర్ : మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం తెలంగాణ జాతిపిత ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. తెలంగాణ రాష్ట్రం కోసం జయశంకర్ చేసిన సేవలు స్మరించుకున్నారు. తెలంగాణ రాష్ట్రం కోసం తన జీవితం అకింతం చేసి జయశంకర్ ఆశయసాధన కోసం ప్రతీఒక్క తెలంగాణ పౌరుడు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు బబ్బురు ప్రతాప్, నాయకులు రేగుల్ల రాములు, దయాకర్, మోహన్‌దాస్, నరేష్, దత్తు, రమేష్, గంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌టౌన్ :పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ప్రొఫెజర్ జయశంకర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ టి.వేణుగోపాలస్వామి జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ప్రొఫెజర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర సాధనలో క్రియాశీలక పాత్ర పోషించారని ఆయన చేసిన కృషి మరువలేనిదని అన్నారు. ఈ కార్యక్రమంలో టి.ఉమకిరణ్, ఎ.రాజేష్, డికె.రాజు, వెంకటేశ్వర్‌లు, యాదగిరి, అనిత పవర్ పాల్గొన్నారు. పట్టణంలోని 15వార్డులో ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

'కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి'

నవీపేట,జూన్21: సుమారు 5నెలలుగా పెండింగ్‌లో ఉన్న తమ వేతనాలను వెంటనే చెల్లించాలని మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన కారోబార్లు, పంచాయతీ కార్మికులు శుక్రవారం డీఎల్‌పీవో శ్రీనివాస్, మండల పరిషత్ కార్యాలయం సూపరిండెంట్ శ్రీనివాస్‌రావుకు వినతిపత్రం సమర్పించారు. మండలపరిషత్ కార్యాలయానికి వారు తరలివచ్చారు. ఐదుమాసాలుగా వేతనాలు రాకపోవడంతో తమకు కుటుంబ పోషణ భారంగా మారిందని వాపోయారు. చిన్న ఉద్యోగులమైన తమకు పెండింగ్ వేతనాలు చెల్లించడంతో పాటు క్రమం తప్పకుండా ప్రతినెల వేతనాలు చెల్లించాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కారోబార్లు నరేష్, మిన్నుకుమార్, తులసిరాం, నర్సింలు, రంజిత్, పంచాయతీ కార్మికుల సంఘం నాయకులు నాయక్‌వాడి శ్రీనివాస్, అంజనేయులు, గౌరి పాల్గొన్నారు.

27న క్రీడా పాఠశాలలో ప్రవేశానికి ఎంపికలు

సుభాష్‌నగర్, జూన్ 21: హకీంపేట్ క్రీడాపాఠశాలలో నాల్గోతరగతిలో ప్రవేశానికి ఈనెల 27వ తేదీన ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి ముత్తెన్న తెలిపారు. నగరంలోని రాజారాం స్టేడియంలో ఉదయం 9గంటల నుంచి ఈ ఎంపికలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 4వ తరగతి ఎంపికల కోసం అభ్యర్థులు 8 సంవత్సరాలు కలిగి ఉండాలని 01-09-2015 నుంచి 31-08-2016 తేదీల మధ్యలో జన్మించి ఉండాలన్నారు. ఆసక్తిగల విద్యార్థులు స్టడీ సర్టిఫికెట్, పుట్టిన తేదీ, కుల ధృవీకరణ పత్రాలతో, 3వ తరగతి ప్రోగ్రెస్ రిపోర్ట్ కాపీ, 5 పాస్‌పోర్టు సైజ్ ఫోటోలు వెంట తెచ్చుకోవాలన్నారు. జిల్లా స్థాయిలో, రాష్ట్రస్థాయిలో ఎంపిక కొరకు ఎత్తు, బరువు, జంపింగ్, వర్టికల్ జంప్, ఫ్లెక్సిబులిటి టెస్ట్, 800 మీటర్స్ రన్, మెడికల్ టెస్టులు నిర్వహించడం జరుగుతుందన్నారు.

చంద్రయాన్‌పల్లిలో చాకలి ఐలమ్మ విగ్రహావిష్కరణ

ఇందల్వాయి, జూన్ 21: మండలంలోని చంద్రయాన్‌పల్లి గ్రామంలో రజకసంఘం ఆధ్వర్యంలో శుక్రవారం చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రజక సంఘం జిల్లా అధ్యక్షుడు గూపన్‌పల్లి శంకర్ విగ్రహావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో చాకలి ఐలమ్మ పాత్ర ఎంతో కీలకమైందని, ఆమె పోరాటం సామాన్య ప్రజలకు స్ఫూర్తిని ఇచ్చిందన్నారు. ఆమె సేవలు మరువలేనివని కొనియాడారు. విగ్రహావిష్కరణ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు శంకర్, చంద్రయాన్‌పల్లి గ్రామ అధ్యక్షుడు దత్తు, మరికొంతమంది అతిథులను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ సంజీవ్‌రెడ్డి, రఘు, రజక సంఘ సభ్యులు ఆశన్న, సాయిలు, దాసు, నారాయణ పాల్గొన్నారు.

గిరిరాజ్ కళాశాల అధ్యాపకురాలికి డాక్టరేట్

నిజామాబాద్ అర్బన్, జూన్ 21: జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధ్యాపకురాలిగా పనిచేస్తున్న దేవల్లతకు డాక్టరేట్ పట్టా లభించింది. ఉస్మానియా యూనివర్సిటీలో ప్రొఫెసర్ శైలజ వద్ద పరిశోధకురాలిగా వృక్షశాస్త్రంలో డాక్టరేట్ పొందారు. జిల్లాలోని గుండారం చెరువుపై లిమ్నోలాజికల్ అధ్యాయాలు అనే అంశంపై ఆమె పరిశోధన చేశారు. చెరువులలో నీటి నాణ్యత, అందులో ఉన్న జంతువులు, మొక్కలపై గత ఏడేళ్లుగా పరిశోధన చేశారు. ఆమె పరిశోధనను పరిశీలించిన యూనివర్సిటీ ప్రొఫెసర్లు ఆమెకు డాక్టరేట్‌ను అందజేశారు.

మంగళ్‌పాడ్‌లో యువకుడి అదృశ్యం

ఎడపల్లి, జూన్ 21: మండలంలోని మంగళ్‌పాడ్ గ్రామానికి చెందిన యువకుడు అదృశ్యం అయినట్లు ఎడపల్లి ఎస్సై వంశీ కృష్ణారెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... ఎడపల్లి మండలం మంగళ్‌పాడ్ గ్రామానికి చెందిన చిత్తారి సంతోష్ (25) అనే యువకుడు ఆటోనడిపిస్తూ జీవనం సాగించేవాడు. ఎప్పటిలాగే ఈ నెల 17వ తేదీన ఉదయం ఆటో కిరాయి ఉందని చెప్పి ఇంట్లో నుంచి వెళ్లిన అతను నేటి వరకు తిరిగి రాలేదు. అతని మొబైల్ ఫోన్ కూడా స్విచ్ఆఫ్ ఉండడంతో అతని కుటుంబసభ్యులు బంధువులను, స్నేహితులను అడిగినా ఆచూకీ లభించకపోవడంతో ఆ యువకుడి తల్లి చిత్తారి పోసాని శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆటో, ఆర్టీసీ బస్సు ఢీకొని విద్యార్థులకు గాయాలు

ఖిల్లా, జూన్ 21: నగరంలోని కంఠేశ్వర్ ప్రాంతం రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో విద్యార్థులతో ఉన్న ఆటో ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన ఘటన శుక్రవారం జరిగింది. ఆర్మూర్‌వైపు వెళ్తున్న ఆర్టీసీబస్సు వెనకవైపు నుంచి విద్యార్థులతో వెళ్తున్న ఆటోప్రమాదవశాత్తు బస్సును ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆటోలో ఉన్న విద్యార్థులకు స్వల్పగాయాలయ్యాయి. తృటిలో పెద్దప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న రూరల్ ఎస్సై మహేష్ ఘటనాస్థలానికి చేరుకొని పరిస్థితిని పరిశీలించారు. ట్రాఫిక్‌ను నియంత్రించారు. ఆటో, బస్సుడ్రైవర్‌లతో సంప్రదించి పరిస్థితిని చక్కదిద్దారు.

'జీవనభృతి 4 వేలు వెంటనే ఇవ్వాలి'

పెద్దబజార్, జూన్ 21: బీడీరంగ పరిశ్రమను కాపాడాలని, కాంగ్రెస్ ప్రభుత్వం జీవనభృతి రూ.4వేలు వెంటనే ఇవ్వాలని ఐఎఫ్‌టీయూ ఆల్‌ఇండియా కమిటీ ప్రధాన కార్యదర్శి పి.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రగతిశీల బీడీవర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని కోటగల్లిలోగల ఎన్ఆర్ భవన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లతో కార్మికుల మెడకు ఉరితాడు బిగించారని ఆయన అన్నారు. పొగాకు తాగితే ఆరోగ్యం దెబ్బతింటుందని చెబుతూ మరోదిక్కు సిగరేట్ కంపెనీలకు అండగా ఉండటం విచారకరమని ఆయన అన్నారు. బీడీ పరిశ్రమ సంక్షోభంలో ఉందని అందుకే బీడీ కార్మికులకు గత ప్రభుత్వం జీవనభృతి ఇచ్చిందని, ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని ఆయన కోరారు.

చికెన్ ధరలు

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.150	రూ.280	రూ. 300
వెన్‌కాబ్(కిలో)	రూ.155	రూ.285	రూ. 305

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.73400	రూ.67,700	రూ.935

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : మహారాజ (11.05, 4.30, 7.35, 10.40)
: మరణం (2.10)
స్క్రీన్-2 : ఇన్‌సాడ్ ఔట్-2 (ఇంగ్లీష్ 3డి) (11.30, 5.05) ఏ (1.50)
: జహంగీర్ నేషనల్ యూనివర్సిటీ(7.25)
: ముంజియా (హిందీ) (10.35)
స్క్రీన్-3 :సందేహం (11.20)
: హనిమూన్ ఎక్స్‌ప్రెస్ (2.00)
: హరోం హర (4.40)
: ఓ మంచి గోస్ట్ (హిందీ) (10.40)
స్క్రీన్-4 : ఇట్లు మీ సినిమా (11.45)
: నిందా (2.20, 7.50, 10.30)
: ప్రభుత్వ జూనియర్ కళాశాల (5.00)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : మహారాజ (1.45, 4.40, 7.35, 10.30)
స్క్రీన్-2 :ఓ మంచి గోస్ట్ (11.10, 4.35)
ప్రభుత్వ జూనియర్ కళాశాల (1.40)
నిందా (7.30, 10.25)
స్క్రీన్-3 : మనమే (1.35, 4.40, 10.30)
: సందేహం (7.40)

దేవి : మహారాజ (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ :చందు చాంపియన్ (11.15, 2.15, 6.15,9.15)
విజయ్ : నిందా (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్